కథ

# నిష్కృతి

ఆఫీస్‌లో ఫైల్స్ మధ్యన బుర్ర దూర్చాడే గాని, సారథి మనసు మనసులో లేదు.

''ఈ నిజాన్ని తనెందుకు భరించలేకపోతున్నాడు? ఎందుకు యాక్సెప్ట్ చేయలేకపోతున్నాడు? ఎందుకు? బహుశా ఇన్నాళ్లూ తెలియని విషయం ఒక్కసారిగా బయటపడడం వలనా! ఏమో...'' ఆలోచనల్తో కల్లోలమైన అతని మస్తిష్కం విపరీతంగా వేడెక్కింది.

నుదుటిమీద వ్రేళ్లతో చిన్నగా రాసుకున్నాడు.

అందునా జరిగిన అవమానం ఎవరిముందు? తాను ప్రేమించి పెళ్లాడబోయే తనూజ ముందు. ఇన్నాళ్లుగా తను ఆమె మదిలో సంపాదించుకున్న ప్రేమానురాగాలన్నీ ఆ ఒక్క క్షణంతోనే తుడిచి పెట్టుకుపోయాయి. ఆ సమయంలో ఆమె చూసిన చూపు ఎంతటి అసహ్యాన్ని నింపుకొని వుంది?

కల్లోల జలధిలా ఉంధతని అంతరంగం.

ఎందుకిలా జరిగింది? ఎందుకిలా అయ్యింది?

పదే పదే ఈ ప్రశ్నే వేధిస్తోంది అతడి మనస్సును.

★ ★ ★

తనూజ బాగా చదువుకున్న డబ్బున్న, అందమైన అతివ.

సారథి కూడా చెప్పుకోదగిన అందగాడే. పైగా ఆఫీసర్ ర్యాంక్‌లో ఉన్నవాడు. ఓ యువతీ యువకుల నడుమ ప్రేమ జనించడానికింతకన్నా అర్హతలింకేం కావాలి అనుకున్నారిద్దరూ.

అంతే! ఉన్నపళాన ప్రేమలో పడిపోయారు.

తనూజ తల్లిదండ్రులు కూడా వీరి ప్రేమకి ఆమోదముద్ర వేశారు.

మంచి తరుణం చూసుకొని, తనూజను తన తల్లిదండ్రులకి పరిచయం చేసి వాళ్ళ ఇష్టంతోనే ఆమెను పెళ్లి చేసుకోవాలనుకున్నాడు.

అందుకు అవకాశం కూడా వారం. రోజుల క్రిందటే వచ్చింది.

తనూజ కజిన్ పెళ్ళి వైజాగ్‌లో ఉందంటే తనూజ, ఆమె తల్లిదండ్రులు ఆ పెళ్లికి ప్రయాణమయ్యారు.

ఎలాగూ తన పేరెంట్స్ వైజాగ్‌లోనే ఉన్నారు కాబట్టి ఆ వంకతో వారికి తనూజను చూపెట్టవచ్చునని సారథి కూడా వారిలో బయలుదేరాడు.

తనూజ, ఆమె తల్లిదండ్రులు వాళ్ల చుట్టాలింటికి వెళ్లిపోయారు. సారథి ఇంటికి వెళ్తూ, సాయంత్రం వారిని తమింటికి రమ్మని ఆహ్వానించాడు.

ఆరోజు సాయంత్రం సారథి ఇంటికి వచ్చారు వాళ్లు. ఆ సరికి సారథి తండ్రి సీతారామయ్యగారింట్లో లేరు.

''అమ్మా! నాన్నగారింట్లో లేకుండా ఎక్కడికి వెళ్లారు? ఇంట్లోనే ఉండమని చెప్పాగా..'' విసుగ్గా అన్నాడు సారథి.

''ఏదో ముఖ్యమైన కాంట్రాక్టు ఉందని మధ్యాహ్నమే అలా బయటకు వెళ్లారు కన్నా!'' అంది తడబడుతూ అతని తల్లి జానకమ్మ.

సారథి తండ్రి ఇంట్లో లేనందుకు తనూజ తల్లిదండ్రులెంతో విచారించారు. జానకమ్మ చేసిన అతిథి మర్యాదలతో తృప్తి పడ్డారు.

ఇంతలో గోడమీదున్న సీతారామయ్యగారి ఫోటో మీద పడ్డాయి తనూజ కళ్లు.

పెద్ద పెద్ద మీసాల్తో, సూటూ బూటుతో దర్జాగా, దర్పంగా వెలిగిపోతున్నారాయన అందులో.

''సారథీ...మీ డాడీ అచ్చు పాత సినిమాల్లో యస్.వి.ఆర్.లా ఉన్నారు. చాలామంచి పర్సనాలిటీ...'' మెచ్చుకుంది తనూజ.

గర్వంగా నవ్వాడు సారథి.

''మ్యారేజ్‌కి టైమౌతోంది. వస్తాం అండీ...'' అంటూ జానకమ్మకి నమస్కరించి బయలుదేరారు వాళ్లు.

తమతోపాటు సారథిని రమ్మని ఆహ్వానించారు కూడా.

సారథి వాళ్ళతోపాటు బయలుదేరి కళ్యాణ మంటపానికి వెళ్లాడు.

అక్కడ మేడమీద షామియానా వేసి డిన్నర్‌కి ఏర్పాటుచేశారు.

పదార్థాలన్నీ మంచి రుచిగా ఉండడంతో ఓ ముద్ద ఎక్కువే లాగించేశాడు సారథి.

చేతులు కడుక్కుందామని వెళ్తూంటే ఎవరివో పెద్ద పెద్ద కేకలు వినిపించి అటువైపు నడిచాడతను.

పెరట్లో పెద్ద గాడిపొయ్యిలు తవ్వించి వంటలు చేయిస్తున్నట్లున్నారు.

పెళ్లికూతురి తండ్రి గావుకేకలు వేస్తున్నాడు ఎవరిమీదో. అతని ముందు తలవంచుకుని నిలబడి ఉన్నాడో వ్యక్తి.

అతన్ని చూడగానే బ్రాన్పడిపోయాడు సారథి. చెయ్యి ఎండిపోతోందన్న ధ్యాస కూడా లేకుండా అలా నిలబడిపోయాడు బొమ్మలా.

ఆయన ఎవరో కాదు. సారథి తండ్రి సీతారామయ్యగారు.

''ఏదో...వంట బాగా చేస్తారని మీకు కాంట్రాక్టిస్తే...మీరు చేసే పని ఇదా! అతిథులందర్నీ వెయిటింగ్‌లో పెట్టి నా పరువు తీస్తారా! ఛీ..ఛీ..మీ వంటవాళ్లందరూ అంతే. చెప్పేదొకటి..చేసేదొకటి. వచ్చిన వాళ్లందరినీ అలా నిలబెట్టేస్తే నాకెంత అవమానంగా ఉందో తెలుసా?'' ఎగిరిపడుతున్నాడు పెళ్లికూతురి తండ్రి.

''కొద్దిగా మెల్లగా మాట్లాడండి! ఇంకొక్క పది నిముషాలాగితే రెండవ విడత వంటలయిపోతాయి. వేడి వేడిగా వడ్డించేస్తాము. మా అబ్బాయి ఊరి నుండి వచ్చాడని వాడితో మాట్లాడుతూ ఉండిపోయాను. అందుకే ఆలస్యమయిపోయింది. క్షమించండి...'' అతని చేతులు పట్టుకొని ప్రాధేయపడుతున్నారు సీతారామయ్యగారు.

ఏమనుకున్నాడో ఏమో ''సర్సరే...వేగం కానీండి మరి. ఈ మంచితనం చూసే ఏమీ అనలేం...'' కండువా దులిపి భుజం మీద వేసుకుంటూ వెళ్లిపోయాడు పెళ్లికూతురి తండ్రి.

తను చూస్తున్నది కలో, నిజమో తెలియని అచేతనావస్థలో ఉన్నాడు సారథి.

తన తండ్రి సామాన్యమైన వంటవాడా! ఇన్నాళ్ళూ ఆయనేదో వ్యాపారం చేస్తున్నాడని తను అనుకుంటున్నాడు.

తనకి నిజం తెలియకపోవడానికి కారణం తను వారిదగ్గర పెరగకపోవడమే.

చిన్నతనం నుండీ హాస్టల్‌లోనే ఉండి చదువుకున్నాడు తను. ఎప్పుడో సెలవులకి ఓ పదిరోజులుండి వచ్చేయడమేకాని వారిదగ్గర ఎప్పుడూ స్థిరంగా ఉండలేదు. అందుకే తండ్రి ఏం చేస్తు

న్నాడో తెలిసే అవకాశం లేకపోయింది తనకి.

అతని మెదడు మొద్దుబారిపోయింది.

ఎప్పుడొచ్చిందో ఏమో, అతని వెనకాతలే నిలబడి ఉంది తనూజ.

ఆమె ముఖంలో అంతులేని అసహ్యం పేరుకొని ఉంది. చూపుల్లో ఆయన పట్ల హీనభావం గోచరిస్తోంది.

సమాధానం చెప్పలేనట్లు మౌనంగా ఉండిపోయాడు సారథి.

''ఆ మీసాలు, ఆ సూటూ బూటూ, ఆ స్టైల్ చూసి ఆర్మీలో పనిచేసి రిటైరయ్యారనుకున్నాను! బహుశా ఆర్మీలో వంటపని చేసేవారనుకుంటా. ఆర్మీలో పనిచేస్తే వంటవాడికూడా అంతంత మీసాలుండాలి కాబోలు...'' హేళనగా పలికిందామె గొంతు.

సిగ్గుతో బుర్ర భూమిలోకి కృంగిపోయినట్లనిపించింది సారథికి.

''ఇప్పుడే చెప్తున్నాను సారథీ అందరి కోడళ్లలా నేనేం మీవాళ్లని మనదగ్గరుండద్దని చెప్పను. కాని...ఆయన ఆ వంట పని మానేసి, ఆయన ఎవరో తెలియని చోటికి వెళ్లి ఉండాలి. వాళ్ళకి నెలక్కావలసిన డబ్బు మనమే ఇద్దాం. నీ అంతటి ఆఫీసర్‌కి, ఒక వంట మనిషి తండ్రని ఎలా చెప్పుకుంటావు? నువ్వీ విషయమేదో తేలిస్తేనే మన పెళ్లి...దట్సాల్!'' విసవిసా నడచి పోయింది తనూజ.

భగవాన్! ఇప్పుడేం చేయాలి? ప్రేమించిన పడతి ఒకవైపు...కన్నవారింకొకవైపు. ఒకవైపు స్వార్థం...ఇంకొకవైపు కొడుకై పుట్టినందుకు నెరవేర్చవలసిన కనీస ధర్మం. ద్వైదీభావంతో కొట్టుమిట్టాడిపోతున్నాడు సారథి.

చివరికి స్వార్థమే గెలిచింది. తనూజ చెప్పినట్లుగానే చెయ్యాలి. ఆమేం వారిని రావద్దని చెప్పిందా ఏం? వంటపని మానెయ్యమంది...అంతేగా.

అంతే..ఆ వేడిమీద ఇంటికెళ్లాడు. తల్లిమీద విరుచుకుపడ్డాడు.


తనతో ఇన్నాళ్లూ ఈ విషయం చెప్పనందుకు తల్లిని నానా దుర్భాషలాడాడు. తనూజ విధించిన షరతులను తు.చ తప్పకుండా అనమాటగా తల్లికి వినిపించాడు.

తండ్రి ఈ వంటపని మానకపోతే జీవితాంతం ఆయన ముఖం చూడనని ఖరాఖండీగా చెప్పేశాడు. తల్లి ఎంతగా బ్రతిమలాడినా బ్యాగ్ సర్దుకుని తండ్రి రాకుండానే ఆ ఇంటినుండి బయటపడ్డాడు.

హైదరాబాద్ చేరాడేగాని ఆ షాక్ నుండి ఇంకా తేరుకోలేకపోతున్నాడు. అతనిలో అంతులేని అంతర్మథనం...అవధులు లేని ఆలోచనల సమరం.

ఆఫీస్‌లో కూడా సరిగ్గా పని చేయలేకపోతున్నాడు.

తండ్రి నిర్ణయం ఏంటోనని అవిశ్రాంత చింతన.



''సర్ మీకు ఏదో లెటర్ వచ్చింది. ఇప్పుడే పోస్ట్‌మాన్ ఇచ్చి వెళ్లాడు...'' అంటూ ఓ కవర్ చేతికి అందించాడు క్లర్క్.

కవర్ ఓపెన్ చేశాడు.

''చిరంజీవి సారథికి,

అమ్మ ఆశీర్వదించి వ్రాయునది.

నీవు క్షేమమని తలుస్తాను కన్నా!''

ఆ సంభోదన సారథిని నిలువెల్లా కదిలించివేసింది.

''అమ్మ నన్నెప్పుడూ అలానే కమ్మగా పిలుస్తుంది!'' తన్మయత్వంగా అనుకుంటూ తిరిగి లెటర్ చదవడం ఆరంభించాడు.

''కన్నా! ఎలా ఉన్నావురా? ఆరోజు కోపంగా నువ్వెళ్లిపోయిన దగ్గర్నుండి నాకు అన్నం తినబుద్ధి కావడంలేదు. నిద్ర రావడంలేదు. నీకు మేమేం అన్యాయం చేశామని అలాంటి మాటలు అన్నీ అని, నాన్నగారు ఇంటికి రాకుండానే నిర్దాక్షిణ్యంగా వెళ్లిపోయావు.

నాన్నగారు వంటపని చేస్తారన్న విషయాన్ని నీదగ్గర దాచడమే నీ దృష్టిలో పెద్ద నేరమయితే, మేం చాలా తప్పులు చేశాం రా...

అన్నింటిలోకి పెద్ద తప్పేంటో తెలుసా! నిన్నింత పెద్ద చదువు చదివించి ఆఫీసర్‌ని చేయటమే! కాని మేం చేసింది తప్పని ఆనాడు మాకు తెలియలేదు. నిన్ను మాదగ్గరే ఉంచితే... మా కష్టం చూసయినా నీకు మా మీద కాస్తంత గౌరవమైనా కలిగి ఉండేదేమో! అయినా ఇప్పుడనుకొని ఏం లాభం? నాన్నగారు ఏం తప్పు చేశారని ఆయన్ని అలా నిందించావు? ఏం? వంటపని చేయడమంటే నీ దృష్టిలో అంత హీనమైందా? అరవై నాలుగు కళల్లో వంట కూడా

కె.కె.భాగ్యశ్రీ

ఒక కళేనన్న సంగతి నీకు తెలుస ుకుంటాను!

నీకింకో విషయం తెలుసా ఁన్నా! మీ నాన్న గారు ఎస్సెస్సెల్సీ పరిక్షల్లో, జిల ్లకే ప్రథముడుగా నిలిచారు. మరి చదువులో మొద టిస్థానంలో ఉన్న మనిషి, ఇలా వంట పనిలోకి ఎందుకు దిగారం టావు, పరిస్థితులు...పరిస్థితుల ప్రాబల్యం వలన. ఇంట్లో బాధ్యతలు, బరువుల ఆర్థిక కారణంగా ఆయన చదువుకు ఉద్వాసన చెప ్పి, వంటమనిషిగా అవతారమెత్తారు. పై చదువులు చదువుకొని గొప్ప వాడవ్వాలన్న ఆయన ఆశల అడియాసలు అయ్యాయి.

కుటుంబాన్ని పోషించడం కోసం తండ్రిగారి నుండి వారసత్వంగా వచ్చిన వృత్తిని ఆనందంగా అందుకున్నారు. మీ పెద్దత్తయ్యని మా అన్నయ్య కిచ్చి, నన్ను మీ నాన్నగారు పెళ్లి చేసుకున్నారు. మీ చిన్నత్తయ్యకి తగిన సంబంధం చూసి పెళ్లి చేశారు.

మా కడుపున నువ్వు, చెల్లాయి కలిగారు. ఇద్ద రికన్నా ఎక్కువ సంతానాన్ని కంటే, వారికి ఉజ్వల భవిష్యత్తునందించలేం అని భావించి, మీ నాన్న గారు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకు న్నారు.

అనూహ్యంగా, మీ చెల్లాయి జబ్బుచేసి మర ణించింది.

మాకు మిగిలిన ఒక్కగానొక్క బిడ్డవైన నీమీదే ఆశలన్నీ పెట్టుకొని బ్రతకడం మొదలెట్టాము.

తను కన్న కలలన్నీ నీద్వారా నెరవేర్చుకోవాలనీ నిన్ను బాగా చదివించి ప్రయోజకుడిని చేయాలనీ ఆయనాక్షణమే నిర్ణయించుకున్నారు.

కొన్నాళ్లు నువ్వు మాదగ్గరే ఉన్నావు.

నీకు జ్ఞాపకం ఉందా కన్నా రెండో తరగతి చదువుతున్నప్పుడనుకుంటా ఓనాడు నువ్వే డుస్తూ స్కూల్‌నుండి ఇంటికొచ్చావు.

ఏమయ్యింది అని మేం అడిగితే-''నాన్నగారు వంటవాడని అందరూ వెక్కిరిస్తున్నారని'' ఏడ్చావు మరింతగా.

అందుకే-ఆయన చేసే వృత్తి తాలూకు ఛాయ లేమీ నీమీద పడకూడదని, నిన్ను దూరంగా, హాస్టల్‌లో వుంచి చదివించాము.

పగలనక, రాత్రనక శ్రమించి డబ్బు కూడబె ట్టారాయన.

నిన్ను ఆఫీసర్‌ని చేశారు.

దాని ఫలితం ఇంత దారుణంగా ఉంటుందని ఆయనకు ఆనాడు తెలీలేదు!

'పెద్ద ఆఫీసర్‌లా సూటు వేసుకొని, ఫోజుగా ఫోటో దిగడమెందుకు?' అని నువ్వు ఈసడించు కున్నావు.

కాని కన్నా! నా భర్తను దొరబాబులా చూసు కోవాలని నేనే పట్టుబట్టి ఆ ఫోటో తీయించాను. అంతేగాని ఏ భేషజాలకోసమో కాదు...లేని దర్పం ప్రదర్శించుకోవడానికి అంతకన్నా కాదు.

ఇంకోమాట...నిన్ను ప్రేమించిన అమ్మాయి, అదే..తనూజ నిజంగా నిన్ను నిన్నుగానే ప్రేమిం చిందా...లేక నీ అందం, హోదాలని చూసి వల చిందా?

నీ మనస్సు చూసి మనసిచ్చినదైతే, కాబోయే మావగారిని నీముందే అలా దూషించదు. అందం, ఆడంబరం చూసి ప్రేమించిన అమ్మాయి కడుపు చూడదు, మనసులో నింపుకోదు. కేవలం పై మెరుగులు చూసి పెంచుకున్న ప్రేమ కలకాలం నిలవదురా...

ఇది నా అభిప్రాయం మాత్రమే. నువ్వంతగా ఆ అమ్మాయినే కావాలని అనుకుంటే అది నీ ఇష్టం. నీ నిర్ణయాన్ని మేమెప్పుడూ ఆమోది స్తాము.

నువ్వు ఆరోజు అర్థాంతరంగా వెళ్లాక, మీ నాన్నగారొచ్చి ఎందుకు వెళ్లిపోయాడని అడిగితే నేనసలు సంగతి ఆయనకి చెప్పలేదు. అది విని ఆయన గుండె తల్లడిల్లిపోతుందిరా...అందుకే ఏదో అర్జెంట్ టెలిగ్రామ్ వస్తే వెళ్లిపోయాడని సర్ది చెప్పాను. కాని...ఈ అబద్ధాన్ని ఎంతకాలం మోయగలనో నాకే తెలీదు.

నువ్వింకోమాటన్నావు. ''నీకు వంటవాడి భార్యగా మిగలడం మక్కువా? లేక, ఆఫీసర్ తల్లిగా ఆనందించడం ఎక్కువా!'' అని.

ఇప్పుడు చెప్తున్నాను. ''నాకు వంటాయన భార్యగా మిగిలిపోవడమే గర్వంగా ఉంటుంది. ఎందుకంటే నేను పెళ్లి చేసుకున్నది ఆయన వృత్తినీ, హోదానీ చూసి కాదు, ఆయన అమృత తుల్యమైన హృదయాన్ని చూసి కాబట్టి. ఆ వంట వాడే లేకపోతే, ఈ ఆఫీసర్ లేడు కాబట్టి.

నీ మనసున మనసై నీ అడుగు జాడలలో నడిచే శ్రీమతినెంచుకో...

ఎల్లకాలమూ నువ్వు ఆయురారోగ్య ఐశ్వర్యా లతో విలసిల్లాలని ఆ సర్వేశ్వరుని ప్రార్థిస్తాను.

సదా నువ్వు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆశిస్తూ-

ఆశీస్సులతో

మీ అమ్మ

జానకమ్మ''

ఉత్తరాన్ని ఆసాంతం చదివిన సారథి కనుకొల కుల్లో నీటిబిందువులు నిలిచాయి. మనస్సు ఆర్ద్ర మైంది.

ఛీ...ఏం మనిషి తను? తన చదువు, సంస్కారం ఏమయినాయి? తల్లిదండ్రులను మించిన దైవం లేదని తెలిసీ...క్షణికావేశంలో తన తండ్రిని, తల్లిముందరే ఎంతగానో తూలనా డాడు. ఆమె మనసెంతగానో నొప్పించాడు.

నిజమే...తనూజ తన అంతరంగం అర్థం చేసు కొని తనను ప్రేమించలేదు. తన రూపం, జాబ్ లాంటి పై ఆడంబరాల్ని చూసి వలచింది. అది ప్రేమకాదు...మోహం! నిజమైన ప్రేమ భేషజా లకు అతీతం...అదొక అమరభావన!

తల్లి తన కళ్లు తెరిపించింది.

ఆమె కాళ్లమీద పడి క్షమాపణలు తెలుపుకుం టేగాని తన పాపానికి ప్రాయశ్చిత్తం లేదు. తన బ్రతుక్కి అర్థం లేదు.

ఇలా ఆలోచించాక సారథి మనసెంతో ప్రశాం తంగా ఏ అలజడి లేకుండా నిశ్చల తటాకంలా ఉంది. ★

